


# హింసధ్వని

ప్రభాకర్ ఉల్లాసంగా కబుర్లు చెబుతూ వంటింట్లో ఉల్లిగడ్డలు, క్యారెట్లు చక చకా తరుగుతున్నాడు. రజనికి వంటింట్లో పూర్తి సాయం చేస్తూ "మాతరం వాళ్ళు వెనకటి మగాళ్ళలా కాదు... స్త్రీలని తలుపుచాటుకి వుంచట్లేదు.

ఇంటి పనిలో వంటపనిలో మేము చేస్తున్నంత హెల్ప్... ఏ కాలంలోనూ ఏ మగాళ్లూ చేయలేదు అందుకే మాతరం మగాళ్ళే గొప్పంటాను." అన్నాడు.

రజని ఓరకంట ప్రభాకర్‌ని చూసి నవ్వుకుంది.

"మీరు చెప్పేది నిజమే... మాకు పూర్తి సాయం అందిస్తున్నారు. కాదనట్లేదు. సరేకాని..." అని ఆగిపోయింది.

"సరేకాని... ఏంటి చెప్పు... ఏనాడైనా నీ మాటకి విలువివ్వకుండా కించపర్చానా? అందులోనూ నాది ఎదుటివాళ్ళని అర్థం చేసుకునే గుణం. నాదేకాదు ఈ కాలం మగాళ్ళలో డెబ్బయ్ శాతం నాలాగే... విషయమేంటో చెప్పు..."

"ఏమీ లేదు... ఆర్నెల్లు ఉద్యోగం మానేద్దామనుకుంటున్నాను" అంది.

ఆ మాటకి ప్రభాకర్ మోహం చప్పున మాడిపోయింది.

"ఆర్నెల్లు మానేస్తావా? ఎందుకు?" అన్నాడు ఆందోళనగా... ఉల్లిగడ్డలు తరగటం మర్చిపోయి.

"ఏమీలేదు... డిగ్రీకాగానే ఉద్యోగం, ఉద్యోగం కాగానే పెళ్ళి, పెళ్లితో పిల్లలు, రోజూ ఆఫీస్... రొటీన్ రొటీన్... ఎడతెగని శ్రమ. ఎల్‌కెజీ చదువునించీ అలసట... అలసట... ఎందుకో... నాలో సహజసిద్ధమైన ఆడతనం ఆర్నెల్లయినా గృహిణిగా వుండాలని కోరుకుంటోంది...."

"నీకేమైనా పిచ్చా... అదేం ఆలోచన.. ఆర్నెల్లంటే నెలకి ఆరువేల చొప్పున ముప్పయ్ ఆరువేలు నష్టం తెల్సా..." కొంచెం ఆవేశంగా అన్నాడు.

రజని పేలవంగా నవ్వింది.

"అది కాదండీ... మొన్న చింటుగాడు ఏమడిగాడో తెల్సా... మమ్మీ... రోజా స్కూల్లో లంచ్‌టైంలో అందరు మమ్మీలు వచ్చి అన్నం తినిపిస్తారు. నువ్వెప్పుడూ రావు... నువ్వు ఉద్యోగం మానేసి స్కూల్‌కొచ్చి అన్నం తినిపించవూ అని బ్రతిమాలాడు..."

"వాడి బొంద... వాడికేం తెల్సు... మనం కష్టపడేది వాళ్ళకోసమేనని పెద్దయ్యాక గాని వాళ్ళకు తెలీదు. వాడేదో సిల్లీగా అడిగితే... నువ్వు ఆర్నెల్లు ఉద్యోగం మానేస్తావా? మతుండే మాట్లాడుతున్నావా?" కోపం ఇంకొంచెం పెరిగింది.

"అది కాదండీ... అంతకు ముందు బంటీకూడా ఏమందో తెల్సా... మమ్మీ... అయిదుగంటలకి ఆటోలో మేం ఇంటికొచ్చేసరికి... నువ్వూ డాడీ ఆఫీసుల్నించి రారు. మీరొచ్చేసరికి దాదాపు ఏడవుతోంది. అంతవరకూ ఇంటిముందు పడిగాపులు పడటం బోర్‌గా వుంది... పింకీకైతే ఇంటికెళ్ళగానే వాళ్ళమ్మ ఎదిరొచ్చి బోర్న్‌విటా ఇస్తుందట... నువ్వొక్కరోజైనా ఎదురుగా రావేంటి మమ్మీ అంది..."

"దాని మొహం... ఆటోకి ఎదురొచ్చి... బోర్న్‌విటా అందివ్వగానే ఏమొస్తుందట? సంపాదించేది వాళ్ళకోసమేనని తెల్సుకోరు. ఈ రోజుల్లో ఇద్దరు సంపాదిస్తే కాని తెల్లారదు అని ఆ చిన్నపిల్లలకేం తెల్సు... అయినా ఇంత చిన్న కారణాలకి ఆర్నెల్లు లీవ్ పెడతాననటం మూర్ఖత్వం..." ప్రభాకర్ నిర్లక్ష్యానికి రజనికి కోపం వచ్చింది.

"వాళ్ళకోసమనే కాదు... ఉద్యోగబాధ్యతల్లో పడి మాకు సంబంధించిన కొన్ని అనుభూతుల్ని కూడా కోల్పోతున్నాం. పేరంటాలకి వెళ్లటం తగ్గిపోయాక మనల్ని పిలిచే వారే కరువయ్యారు. రోజూ ఇంటికి తాళం కప్ప వెక్కిరిస్తుండటంతో మనింటికి వచ్చే వాళ్ళే లేకుండా పోయారు. మనుషుల మధ్య వున్నా అడవిలో వున్నట్టే వుంది. రెండు గంటలు రథం ముగ్గేసుకోవాలని... తలారస్నానం చేసి మనసునిండా శివస్తోత్రం చదువుకోవాలని... పిల్లల్ని ఒడిలో పడుకోబెట్టుకొని ఎన్నెన్నో చందమామ కథలు చెప్పుకోవాలని... వాళ్లకళ్ళల్లో మెరుపులు చూడాలని... ఇంకా చాలా వున్నాయి..." ఉద్వేగంగా అంది రజని.

ప్రభాకర్ రజని మాటలకి విస్తుపోయాడు. రజనిని ఓ పిచ్చిదాన్లా చూసాడు. "అలాంటి చిల్లర పనులకోసం ముప్పయ్ ఆరువేలు నష్టపోదామా? నీకేమైనా పిచ్చిపట్టిందా?" కోపం తారాస్థాయికి చేరింది.

"ఆ అనుభూతులు కోల్పోతుంటేనే జీవితం నిస్సారమై ఏదో వెలితి ఏర్పడుతోంది. ముఖ్యంగా మా ఉద్యోగినిల్లో అంతరాంతరాల్లో పేరుకుంటున్న అసంతృప్తి ఇది. ఆ అనుభూతుల్ని తిరిగిపొందటం కోసమే... కనీసం ఆర్నెల్లయినా లీవ్ పెడదామనుకుంటున్నాను."

"నువ్వు లీవ్ పెడితే చంపేస్తాను" ప్రభాకర్ అరచినంత పని చేసాడు.

రజని కళ్లల్లో నీళ్లొచ్చాయి.

"ఇప్పటివరకూ ఆ తరమే గొప్ప మగాళ్ళని ప్రగల్భాలు పలికారు కదా. ఎక్కడ మీ గొప్ప..." అంది ఉక్రోషంగా.

"ఇంత పని చేసిపెడుతున్నాం... కన్పించట్లేదా?" ఉల్లిగడ్డల ప్లేటు ఎత్తి పడేస్తూ అన్నాడు.

"మీ సహకారంలో స్వార్థముంది.. సంపాదించే భార్యని కాబట్టి టైం ఎడ్జస్ట్‌మెంట్ కోసం, మేం తెచ్చే జీతం కోసం మీరు ముసుగేసుకుంటున్నారు. తప్పితే.... ఆర్నెల్లు లీవ్ పెడుతున్నాననగానే... మీరు ఉల్లిగడ్డలు తరగటం ఆగిపోయి పావుగంటయింది. ముప్పయ్ ఆరువేల జీతం రాదని తెలిసాక మీ నిజరూపమేంటో తెలుస్తోంది...." రజని ఆవేశంగా అంది.

ఆ మాటకి రజని చెంప చెల్లుమంది.

ఆ దెబ్బకి మామ్మీడాడీల గొడవని భయంగా చూస్తున్న ఇద్దరు పిల్లల్లో చప్పున కన్నీళ్లొచ్చాయి. డాడీ కోపానికి భయమేసినా అమ్మ ఏడుస్తుంటే బేలగా చూస్తుండిపోయారు.

"ఈ ఇంటికేదో దరిద్రం పడుతోంది. లేకుంటే ఇలాంటి ముదనష్టపు ఆలోచనలు రావడమేంటి... వారం పదిరోజులైనా కాదు... ఏకంగా ఆర్నెల్లు... సర్వీస్‌లో కూడా బ్రేకొస్తుందన్న ఇంగితజ్ఞానం లేదు..." ప్రభాకర్ రజనిని తిడుతూనే డ్రెస్ వేసుకొని స్కూటర్‌మీద ఆఫీస్‌కెళ్లిపోయాడు.

ఇంతలో స్కూల్ ఆటో రావటంతో పిల్లలిద్దర్నీ పంపించేసింది. పిల్లలిద్దరిలోనూ ఒకటే ఆలోచన 'ఈ రోజు స్కూల్ లేకుంటే బావుండేది. అమ్మని ఓదార్చేవాళ్లం' అని వెనక్కి తిరిగి చూస్తూ వెళ్లలేక వెళ్ళలేక ఆటోలో వెళ్ళిపోయారు.

రజని మొహం కడుక్కుంది. గుండె బరువుగా మారింది... ఎవరికీ ఏమీ

చెప్పుకోలేని స్థితి.. ఆఫీస్‌కి వెళ్ళాలన్పించలేదు... కాని అనవసరంగా ఒక్కరోజు క్యాజువల్ లీవ్ వేస్ట్ చేసానని వచ్చాక ప్రభాకర్ కేకలు వేస్తాడన్న భయానికి భారంగా ఆఫీస్‌కి తయారైంది.

ఇంటికి తాళం వేస్తూ హ్యాండ్ బ్యాగ్ చూసుకుంది. రానూపోనూ బస్ చార్జీలకు గాను పదిహేను రూపాయలకు మించి హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకోనివ్వడు. రజనికి నిర్వేదంతో కూడిన నవ్వొచ్చింది.

"నిజంగా... ప్రభుత్వం మెటర్నటీ లీవ్ మీద నాలుగునెలలు జీతం ఇవ్వకపోతే... అసలు గర్భం రాకుండానే చూసేవాళ్లేమో... థాంక్‌గాడ్" అనుకొని బస్టాండ్‌కి గబగబా బయల్దేరింది.

xxx xxx xxx

నిండు గర్భిణిలా వచ్చిన బస్సులోకి పద్మవ్యూహంలో చొరబడ్డట్టుగా అతి కష్టంమీద చొరబడింది. అరగంట లేటుకి ఆఫీసర్‌కి ఏం కారణం చెప్పాలా అని ఆలోచనలో పడింది.

"టికెట్ మేడం" అని విన్పించటంతో చిల్లర డబ్బులు తీసిచ్చింది. మనుషుల మధ్య నలిగిపోతున్న ఆ లేడీ కండక్టర్ని చూడగానే మనసు చివుక్కుమంది. టికెట్ తీసుకున్నాక ఆమె పక్కన చోటుండటంతో 'కూచోండి మేడం' అంటూ సీటిచ్చింది. తన ఎస్.ఆర్. గబగబా నింపుకుంటూనే 'ఏ ఆఫీస మేడం' అంది.

'పంచాయత్‌రాజ్...' అంది రజని క్లుప్తంగా

అదృష్టవంతులు... ఫ్యాన్ కింద కూచుండి పని చేస్కుంటారు" తల త్రిప్పకుండానే నవ్వుతూ అంది.

"ఎలా వుంది... నీ జాబ్?" అంది రజని క్యూరియాసిటిగా

ఆమె తలత్రిప్పి చూసింది... ఆ కళ్ళల్లో కోటానుకోట్ల ప్రశ్నలు... మెరుపులా పాకిన సన్నటి ఎర్రజీర... దాన్ని కప్పేసిన కన్నీటి పొర...

"ఆర్థిక పరిస్థితులు లేదా మగాడి బలవంతం... ఏదో ఒకటి ఈ ఉద్యోగం చేయిస్తాయి తప్ప కావాలని ఎవరూ ఇలాంటిది కోరుకోరు.... అనేసి వెళ్ళిపోయింది. టిక్కెట్ టిక్కెట్ అనుకూంటూ...

"ఆర్థిక పరిస్థితులు లేదా మగాడి బలవంతం..."

మనసుమీద కొరడాతో కొట్టినట్టు... గిలగిల్లాడింది.

మరో పది నిమిషాల్లో కొన్ని టిక్కెట్లిచ్చి వచ్చి కూచుంది. ఎస్.ఆర్. నింపి కొంచెం రిలీఫ్‌గా ఫీలయింది. స్త్రీకి సహజసిద్ధమైన సుకుమారం, లాలిత్యం ఇప్పుడిప్పుడే దూరమవుతూ అస్థానాన్ని ఆక్రమిస్తున్న కరకుదనం.

"నిజం చెప్పు... ఎలా వుంది ఉద్యోగం" అంది రజని సీరియస్‌గా.

మళ్ళీ రజని కళ్ళలోకి చూసింది. ఏ ఆత్మీయత అగుపడిందో కాని... కనుకొసల్లో దూకిన జలపాతాల నడుమ... పెదాల మీద చిట్లిపోయిన ఆరుద్రపురుగు లాంటి నవ్వు...

"ప్రయాణమే జీవితమై పోయింది..."

ఎక్కేవాళ్ళే... దిగేవాళ్ళే... ఎవరూ నావాళ్ళుకాదు... గమ్యాలెన్నయినా ఏ గమ్యమూ నాది కాదు...

ప్రతి ట్రిప్పు... ఓ పద్మవ్యూహం.

చిల్లర నాణేలతో గుండె గలగలా శబ్దం చేస్తుంది... కళ్ళలోంచి చొంగకార్చుకుంటూ ఎన్ని గొంగళి పురుగులు పాకిపోతాయ్...

ఉక్కపోతకి ఏ పాప ఏడ్చినా... ఇంటి దగ్గరి పిల్లలు గుర్తొచ్చి... గుండె 'హాఫ్ టిక్కెట్టయి' చిరిగిపోతుంది.

రాతి ఉదయం... రైట్‌రైట్‌తో మొదలై... రాత్రి ఇంటికి లగేజీ టిక్కెట్టయి వెళ్తాను...

కాళ్ళని చుట్టేసిన పిల్లల్తో... కన్నీటి స్పీడ్ బ్రేకరై చిట్లిపోతాను.. టిక్కెట్ క్లిప్పుతో కొడితే నొక్కులు పడిన బస్సుటాపులా గుండె చిల్లులుపడుతుంది. కలం జలతారుని... ఈ తోలుసంచీలో చెల్లని నోటులా కుక్కేసుకొని జీవితపు ఎస్.ఆర్. నింపడానికి... నేను సైతం లోహవిహంగాన్నవుతున్నాను.

నిండివున్న డీజిల్ టాంకులా... నా గుండెనిండా ఎన్ని లీటర్ల కన్నీళ్ళుంటేనేం... మొగుడి దోసిలినిండా... మొదటి తారీఖున జీతం ధారబోయాల్సిందే..."

ఆమె మాట్లాడిందో... ఆమె కన్నీళ్ళు మాట్లాడాయో అర్థం కాలేదు కాని... రజని స్టేజీ రావటంతో... ఆప్యాయంగా ఆమె చేతిని నొక్కి బస్సుదిగింది. పరుగులాంటి నడకతో ఆఫీస్‌వైపు నడిచింది.

ఎందుకో చప్పున పిల్లలు గుర్తొచ్చారు.

తొందర్లో బంటీకి క్యారీబాక్స్ పెట్టడం మర్చిపోయినట్టు గుర్తొచ్చింది.

మనసుకి ముల్లు గుచ్చుకున్నట్టుగా తల్లడిల్లిపోయింది.

xxx xxx xxx

ఆ రోజు... ఆఫీస్‌లో ఏవో ఇంటర్వ్యూలున్నట్లున్నాయి.

మగవాళ్ళతో సమానంగా ఆడవాళ్ళు కన్పించారు. ఉన్న మూడు ఉద్యోగాలకి గాను ఎంతకాదన్న డెబ్బయ్‌మందిని ఇంటర్వ్యూకి పిలిచుంటారు.

వాళ్ళని దాటుకుంటూ రజని తన గదిలోకి వెళ్ళబోతుంటే... "మీరు ఇదే ఆఫీసా..." అని విన్పించింది.

సంధ్య... పక్కింటమ్మాయి

రజని ఆశ్చర్యపోయి... 'వ్యాట్... నువ్వు ఇంటర్వ్యూకొచ్చావా? అదేంటి... హౌజ్‌వైఫ్‌గా హాయిగా వున్నదానివి... అందులోనూ మీ ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కదా..." అంది.

సంధ్య నిట్టూర్చింది.

"డిగ్రీ డిస్‌కంటిన్యూ అయి ఏడేళ్ళయింది. మావారి బలవంతం మీద డిగ్రీ తీసాను. అలాగే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో డిప్లొమా చేయించారు. ఉద్యోగం చేయాలని పెద్దగా నాకు లేదు కాని... మా ఆయనేమో నీకేం ఇబ్బంది? నేనే ఆఫీస్ దగ్గర దింపేసి మళ్లీ తీసుకొస్తా కదా... వంటింటి పనికూడా సగం షేర్

చేసుకుంటాననటంతో... తప్పదని ట్రై చేస్తున్నాను..."

రజని నిర్ఘాంతపోయింది.

సంధ్య ఇంట్లో సైతం... ఉద్యోగాలకి సంబంధించిన ఘర్షణ జరుగుతోందా? ఆదర్శాల ముసుగేసుకొని ఆడదాన్ని బయటికి పంపిస్తూనే.. మగాడు చాలా తెలివిగా దోచుకుంటున్నాడా? మరి ఏ ఉద్యోగస్తురాల్ని కదిలించినా తనకు ఆర్థిక స్వాతంత్ర్యం పూర్తిగా వున్నట్టు... తన జీతాన్ని తాను స్వేచ్ఛగా ఖర్చు చేసుకుంటున్నట్టు... ఎవరూ చెప్పట్లేదేం?

ఆర్థిక స్వాతంత్ర్యం లేని ఈ ఉద్యోగాలు ఎవరికోసం చేస్తున్నట్టు ??? భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసుకొనేవాళ్ళని చూసి సంధ్య భర్తల్లాంటి వాళ్లు ఆర్థికంగా తామేదో వెనకబడిపోతున్నామని భయపడి ఇలా బలవంతంగా ఉద్యోగాలు చేయించటం... ఎందుకీ సంఘర్షణ?

ఏమిటీ జీవితాలు ??

"మూడు పోస్టులే వున్నాయట కదండీ... ఈసారి జాబ్ రాకపోతే ఆయన ఇంకా తిడతారు..."

ఆ అమ్మాయి కళ్ళల్లో భయం... బెరుకు...

రజని తేరుకొని 'ఇంటర్వ్యూలో భయపడకుండా జవాబులివ్వు బెస్టాఫ్‌లక్' అని చెప్పి కదిలింది.

ఆఫీసర్ ఇంకా రాకపోవటంతో... కబుర్లు జోరుగా సాగుతున్నాయి. త్వరలోనే కొత్త ఆఫీసర్ వస్తున్నారట. "లేడీబాస్" అని తెలియటంతో రజనిలో

కూడా కుతూహలం చోటు చేసుకుంది. కాని... ఆ వెంటనే చెవిని చేరిన మరో గుసగుస... ఆమె ఏడాది కింద భర్తనించి విడాకులు తీసుకుందట...'

రజనికి మరోసారి గుండెని గోనె సంచిలో కట్టిపడేసి... మురిక్కాలువలో విసిరేసినట్లయింది.

స్తబ్దుగా వుండిపోయిందల్లా... రత్నమాల అటెండర్‌తో గొడవపెట్టుకోవటంతో ఈలోకంలోకొచ్చింది. రత్నమాల ఆఫీస్‌లో 'చిట్టీ' నడుపుతుంది. త్రీ పర్సెంట్ చొప్పున వడ్డీలకిస్తుంది. జీతాల్రోజున ముక్కుపిండి వసూలు చేస్తుంది. రత్నమాలని చూస్తే రజనికి ఎప్పుడూ ఆశ్చర్యమే...

సంపాదించాలి అనే తపన సహజంగా ఆడవాళ్ళలో తక్కువవుంటుంది. కాని రత్నమాల అందుకు భిన్నం.

లంచ్ అవర్లో ఆఫీస్ క్యాంటీన్‌లో రజని అదే విషయాన్ని రత్నమాలతో నవ్వుతూ కదిపింది.

"ఏం చేయనమ్మా... నా మొగుడికి ఏ ఉద్యోగమూ లేదు. తెచ్చే జీతం చాలదని మొదట్లో ఓవర్‌టైంలు చేయమని ఒత్తిడి చేసేవాడు. ఓటీలు చేసి ఇంటికెళ్లేసరికి రాత్రి తొమ్మిదయ్యేది. పిల్లలకి అన్నాలు తినిపించి తనే నిద్రపుచ్చేవాడు. నేను చేయాల్సిన పనులన్నీ ఆయనే చేస్తాడనుకో... పిల్లలకోసం ఓవర్‌టైంలు చేయటం మానేసి... ఇదిగో ఇలా వడ్డీలకు ఇవ్వటం నేర్చుకున్నాను.

"మొత్తానికి ఆడవాళ్లు ఉద్యోగం చేయటం గొప్ప సామాజిక మార్పు అంటారు కాని నాకు ఇంకేదో కన్పడుతోంది....." అంది రజని సాలోచనగా.

"మగాడు మారలేదమ్మా... ఆడదానికి ఉద్యోగవకాశాలు పెరగటంతో మారినట్లు నటిస్తున్నాడు. మనం ఉద్యోగాలు చేయటం అనేగొప్ప సామాజిక మార్పు వెనక ఒక నిశ్శబ్ద దోపిడి సాగుతోంది...." అంది రత్నమాల.

ఆ మాటతో రజనికి చప్పున ఉదయం ప్రభాకర్‌తో జరిగిన ఘర్షణ గుర్తొచ్చింది. "మరి ఇప్పటి తరం మగాళ్ళలో కన్పించే మార్పు..." అంటూ ఆగిపోయింది రజని.

"ఆ మార్పు మర్రిచెట్టు నీడ కాదమ్మా... పడగనీడ... మగాడిలో ఇప్పుడు కన్పిస్తున్న సహానుభూతి తెచ్చిపెట్టుకున్నదే కాని... శాశ్వతం కాదు. గృహిణికుండే సర్దుబాటు ఉద్యోగిని కోల్పోతుంది. జీతానికి తప్ప వ్యక్తిత్వానికి విలువివ్వకపోవటం పట్ల కల్లోల సంద్రమైపోతోంది. ఆ సంఘర్షణలోంచే మగాడే దిక్కనుకునే కన్నా విడాకులే ఉత్తమమనుకునే ధోరణి మన దేశంలో కూడా చొచ్చుకొస్తోంది. ఒకప్పుడు భర్త క్రూరంగా ప్రవర్తిస్తేనే విడాకులకు ప్రధాన కారణంగా కన్పించేది. కానిప్పుడు భర్తనించి భార్యకి, భార్యనించి భర్తకి ఆశించిన మద్దతు లభించకపోతేనే విడాకులు..."

రత్నమాల మాటల్లో వేదనాభరితమైన జీర...

"ఎందుకిలా జరుగుతోంది"

"అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న గొంగళి పురుగు దశ ఇది" అంది టిఫిన్ బాక్స్‌లోనే చేయి కడుగుతూ. రజని కూడా చేయి కడుక్కుంది.

"అదేంటి రజనీ... అన్నం వదిలేసావ్" అడిగింది రత్నమాల.

"ఎందుకో తినాలన్పించట్లేదు... మూడ్ బాగాలేదు" అంది అన్యమనస్కంగా.

"పోనీ... ఐస్‌క్రీం తింటావా?" అని క్యాంటిన్ స్వీపర్‌ని పిలిచి రెండు వెనిజులా చెప్పింది. రత్నమాల ఫ్రీగా డబ్బు ఖర్చు చేస్తుంది. అదే అర్థం గాక...

"అదేంటి... మీ ఆయనకు లెక్కలు చెప్పేటప్పుడు ఇలా ఐస్‌క్రీంలు తిన్నామంటే ఊర్కొంటాడా" అంది సంశయంగా.

"అలాంటివి మగాళ్ళు సహిస్తారా? అయినా ఏదో చెప్పాలి. జీతాన్ని సొంతంగా ఖర్చుపెట్టుకొని మిగిలింది తీసికెళ్లి ఇదే మిగిలింది మొగుడా అని చేప్పే ధైర్యం ఇంకా రాలేదమ్మా... నువ్వు తట్టుకుంటానంటే ఓ భయంకరమైన నిజం చెప్తాను. క్యాంటీన్ స్వీపర్ రత్తాలు తెల్సుగదా... దానికొచ్చే జీతం రెండువేలు.. దాని మొగుడు పెద్ద తాగుబోతు. ఇది ఓ రోజు జీతం పడ్డాక మనసు ఆపుకోలేక ఇదే క్యాంటీన్‌లో బిర్యాని తిని... థమ్సప్ తాగి... ఓ చీరె కొనుక్కొని... పన్నెండొందలు తీసికెళ్ళి మొగుడి చేతిలో పోస్తే... ఎనిమిది వందలేం చేసావ్ అని చావు దెబ్బలు కొట్టాడు. ఆ ఎనిమిది వందలు ఎలా సంపాదించిందో నీకిప్పటికే అర్థమై వుండాలి. అంది క్యాంటీన్ ఓనర్ వైపోసారి చూసి.

రత్తాలు అప్పుడే రెండు ఐస్‌క్రీం కప్పులు తెచ్చిపెట్టి వెళ్ళింది. ఇద్దరూ ఐస్‌క్రీం తిన్నారు.

రజనికి తలనొప్పి మొదలైనా... తెలీలేదు.

దానికన్నా మనసంతా నొప్పిగా వుండటమే!!

xxx xxx xxx

రజని ఆఫీస్ వదిలి... బస్టాప్‌కి రాగానే బస్సు వెళ్ళిపోయింది. అరగంట నిల్చోవాలి తప్పదు అనుకునే సమయంలో... కైనెటిక్ హోండా మీద వేగంగా వెళిపోతున్నదల్లా ఓ జీన్స్ ప్యాంట్ అమ్మాయి రివ్వున వెనక్కి తిరిగొచ్చి... "ఆంటీ... వస్తారా?" అంది

ఆమె... క్షమజ

రజని హమ్మయ్య అనుకుంటూ క్షమజ వెనకాల కూచుంది. క్షమజ కంప్యూటర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఈ మధ్యే పెళ్ళయినా ఎన్నడూ చీరెలో కన్పించలేదు. క్షమజ డ్రైవింగ్‌కి రజని భయపడుతూ...

"క్షమజా... అంత రాష్ డ్రైవింగ్ చేస్తావేంటే?" అంది

"తప్పదాంటీ... మూడింటికే వస్తానని రాకేష్‌కి ఫోన్ చేసాను. ఆరుదాటింది" అంది నవ్వుతూ.

"మూడు గంటలు వెయిట్ చేసినందుకు మీవారు ఏమీ అనరా..." అడిగింది రజని.

"ఎందుకంటారు? అంటే నే వూర్కుంటానా? ఛీరేస్తా" అంది క్షమజ.

"చలాకీదానవే.."

"అది కాదాంటే.. స్త్రీ సంపాదనాపరురాలైనప్పటి నుండీ మగాడి కరకుదనం అడదానికి, అడదాని సున్నితత్వం మగాడికీ చాపకింది నీరులా డైవర్ట్ అవుతోంది. అలా మహిళాధిక్యత పెరిగిపెరిగి మగవాడు బాధితుడుగా మారటమే భవిష్యత్తులో కన్పించే ఒక విషాదకర పరిణామం..." అని గలగలా నవ్వేసి... వీధి మలుపులో దింపేసి పోయింది.

క్షమజ ఆ మాటలు తేలిగ్గా అనేసి వెళ్ళినా... రజనిని తేనెతుట్టెలా చుట్టుముట్టాయి.

"రజని గారూ... ఏలోకంలో వున్నారు" అని రెట్టించిన మాట విన్పించటంతో ఈ లోకంలో పడింది. ఎదురుగా మంజుల.

"మా బాబు బర్త్డే... లోపలికి రండి కేక్ తిని వెళ్దురుగాని..." అని పిలిచింది. మంజుల హౌజ్‌వైఫ్, ఎప్పుడూ ఏ కష్టమూ ఎరగనట్టు ప్రశాంతంగా వుంటుంది. రజని లోపలికి నడిచింది. పదిమంది పిల్లలు తప్ప పెద్దవాళ్ళెవరూ లేరు. వాళ్ళ బాబు కేక్ కట్ చేసాడు. రజనికి మంజుల కాఫీ కలిపి ఇస్తుంటే...

"మీ అయన జీతమెంత?" అంది రజని

"అయిదువేల వరకూ వుంటుంది." అంది మంజుల

"వాట్... సరిపోతుందా? ఎందుకంటే నువ్వు జాబ్ చెయ్యవుగా"

"ఎందుకు సరిపోదండీ? తృప్తి పడే గుణముండాలి. మేమింకా వెయ్యి రూపాయ చిట్టీ కూడా కడతాం."

రజనికి ఆశ్చర్యమేసింది.

మంజుల చెప్తూ "నాకూ మా వారికీ ఉన్నదాంట్లో సంతృప్తి పడే అలవాటుంది. నేను ఉద్యోగం చేయటం ఆయనకు పెద్దగా ఇష్టముండదు. పిల్లల్ని నేనే స్వయంగా స్కూల్‌కి పంపటం, తీసుకురావటం, మధ్యాహ్నం లంచ్ తీస్కెళ్లి తినిపించటం, ఆయన ఆఫీస్ నించి రాగానే కాఫీ కలిపివ్వటం... ఇలాంట పనులే మా వారికిష్టం" అంది నవ్వేస్తూ.

"ఆర్థికంగా..." అంటూ రజని ఏదో అనబోయింది.

"ఒకరికొకరం భరోసా అనే బంధాన్ని ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం చేస్తోంది. దాంతో తృప్తి అనేది దూరమవుతోంది. సంతృప్తిగా లేని జీవితాల్లో ఏం సాధిస్తేనేం? ఎంత సంపాదిస్తేనేం అనేది మా పాలసీ.... అఫ్‌కోర్స్ చాలామంది ఉద్యోగినిలకి హౌజ్‌వైఫ్‌లంటే కొంచెం చులకన భావం వుండొచ్చు. ఇంట్లో పని చేయ్యటమంటే పనిమనుషులుగా మారటమేనని వాళ్ళ ఉద్దేశ్యం. కాని.. నా ఇంటి పని నేను చేసుకుంటూ నేను పనిమనిషినా అని ఫీలవటం అంటే మానసికంగా కుటుంబ సభ్యులతో దూరంగా వుంటున్నట్టే... సంసారమన్నాక మానసిక బంధం వుండాలి"

అంది మంజుల.

మంజుల మాటల్లోనూ నిలువెత్తు నిజం కన్పడింది రజనికి. అదే ఆలోచిస్తు రజని ఇల్లు చేరింది.

అప్పటికే... ప్రభాకర్ పిల్లలిద్దరకీ స్నానాలు చేయించి నైట్ డ్రస్‌లు వేసాడు. రజని ముభావంగా వంటపనిలో మునిగిపోయింది.

డైనింగ్ టేబుల్‌మీద అన్నీ సర్దుతున్నప్పుడు స్వీట్స్ పట్టుకొచ్చింది ఎదురింటి అమ్మాయి ప్రత్యూష.

"నేను ఎం.సి.ఎ. పాసయ్యానాంటీ..." అంటూ

స్వీట్స్ తీసుకుంటూ ప్రభాకర్ అడిగాడు.

"ఏదైన జాబ్‌లో జాయినవుతున్నావా? అని ఆ ప్రశ్నకి ఆ అమ్మాయిలో కలవరం కోపం ఒకేసారి కన్పించాయి.

"లేదంకుల్... నేను హౌజ్‌వైఫ్‌గా సెటిలవుదామనుకుంటున్నాను" అంది ధృఢంగా.

"అదేంటే? ఇంత చదువు చదివీ..." ప్రభాకర్ ఆశ్చర్యపోయాడు. రజని కూడా!!

"అవునంకుల్ కట్నం కావాలి అనే మొగుడొస్తే ఉద్యోగం చేయను.

ఉద్యోగమే చేయాలి అనే మొగుడొస్తే అసలు కట్నమే ఇవ్వను అలాంటివాడు దొరికినప్పుడే పెళ్లి చేసుక్కుంటా... కాని... ఇటు కట్నం... అటు ఉద్యోగం చేసే ఆడదే కావాలి అనే మగాణ్ణి పెళ్ళి చూపుల పేరుతోనైనా మా ఇంటి గడప తొక్కనివ్వను...

ఆలోచిస్తే... ఆచరిస్తే... ఏళ్ళ తరబడి అసలే పరిష్కారం కాని వరకట్న సమస్యని కొంతయినా బద్దలుకొట్టే అవకాశం ఇప్పుడు ఇలా వస్తోంది..." అనేసి విసవిసా వెళ్ళిపోయింది.

ప్రభాకర్ ఖంగుతిన్నాడు.

ప్రత్యూష వెళ్ళిపోతుంటే... రజని చప్పట్లు చరిచింది.

*